హమాలీలు, చాట కార్మికులకు డ్రెస్‌కోడ్

ఓల్డ్‌మలక్‌పేట జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జాతీయ వ్యవసాయ మార్కెట్‌లో పనిచేస్తున్న హమాలీ, చాట కార్మికులకు రూ.10లక్షలతో యూనిఫాం చీరలు అందించనున్నట్లు మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి చిలక నర్సింహారెడ్డి తెలిపారు. మలక్‌పేట వ్యవసాయ మార్కెట్‌లో శనివారం విలేకరుల సమావేశంలో ఆయన వెల్లడించారు. హమాలీ కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వారికి లైసెన్సులు, గుర్తింపు కార్డులు జారీ చేస్తుందన్నారు. మార్కెట్‌లో రైతులు హమాలీలను సులువుగా గుర్తుపట్టే విధంగా హమాలీలకు డ్రెస్‌కోడ్ అమలుచేస్తున్నామని రెండుజతల యూనిఫాం హమాలీలకు, రెండు చీరలు చాటకార్మికులకు అందించనున్నట్లు తెలిపారు. త్వరలోనే మార్కెట్ కమిటీ పాలకవర్గం చేతులమీదుగా వీటిని అందించనున్నామన్నారు.

మ్యాన్‌హోల్స్‌కు సేఫ్టీ గ్రిల్స్



పనులను పరిశీలిస్తున్న డీజీఎం

ఓల్డ్‌మలక్‌పేట జూన్28 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని మ్యాన్‌హోల్స్ మీద సేఫ్టీ గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు.మ్యాన్‌హోల్స్‌ల వద్ద ప్రమాదాలు జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. జలమండలి అధికారులు, సిబ్బంది. శనివారం ఓల్డ్‌మలక్‌పేట డివిజన్‌లో పలు కాలనీలలో డీప్ మ్యాన్‌హోల్స్ మీద సేఫ్టీగ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నారు. మలక్‌పేట డివిజన్ జలమండలి డీజీఎం సయ్యద్ హస్మత్ అలి పనులను పర్యవేక్షిస్తున్నారు. డీజీఎం మాట్లాడుతూ ఆయా కాలనీల్లో వాటర్ లాగిన్ పాయింట్లను గుర్తించి గ్రిల్స్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వరద అధికంగా వచ్చే ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ వద్ద రెడ్ కలర్ గుర్తులుపెట్టి గ్రిల్స్ ఏర్పాటు చేశామన్నారు. మురుగు, తాగునీటి సమస్యలున్నట్లయితే జలమండలి టోల్‌ఫ్రీ 155313కి ఫోన్‌చేయాలని సూచించారు.

స్పోర్ట్స్ హబ్‌గా తెలంగాణ : శివసేనారెడ్డి

ఎల్‌బీనగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దుతామని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ ఛైర్మన్ శివసేనారెడ్డి అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో బాక్సింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎలైట్ ఉమెన్స్ నేషనల్ లెవల్ బాక్సింగ్ టోర్నమెంట్2025ను శాట్ ఎండీ సోనిబాలాదేవి, టోర్నమెంట్ ఎండీ లెల్లి డి గామ, బాక్సింగ్ ప్రపంచ ఛాంపియన్స్ నిఖత్ జరీన్, నీతుగంగస్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్, రాష్ట్ర పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ చల్లా నరసింహారెడ్డిలతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ టోర్నమెంట్ నాలుగు రోజుల పాటు జరుగనుంది. ఈ టోర్నమెంట్‌లో 101 జాతీయ క్రీడాకారులతో పాటు 12 మంది అంతర్జాతీయ క్రీడాకారులు కూడా పాల్గొంటున్నారు.

ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలి : రవిప్రసాద్

ఇబ్రహీంపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేవలం ఉద్యోగులుగా గాకుండా విద్యార్థులు పది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని వైఆర్‌పీ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ యెలిశాల రవిప్రసాద్ అన్నారు. హైదరాబాద్ మాదాపూర్‌లోని వైఆర్‌పీ ఫౌండేషన్ కార్యాలయంలో శనివారం 30 మంది పేద విద్యార్థులకు రూ.8.15 లక్షల స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. ఎంబీబీఎస్, ఇంజనీరింగ్, హైస్కూల్, ప్రైమరీ చదువులకోసం పేద విద్యార్థులకు చేయూతనీయాలనే ఉద్దేశ్యంతో ఈ స్కాలర్‌షిప్‌లు అందజేస్తున్నట్లు రవిప్రసాద్ తెలిపారు. మార్పు కోసం అన్నింటికంటే శక్తివంతమైనది విద్యేనని అన్నారు. ఇప్పటి వరకు 250 మందికిపైగా విద్యార్థులకు ఆర్థికసాయం అందజేశామన్నారు. కార్యక్రమంలో వైఆర్‌పీ ఫౌండేషన్ నిర్వాహకులు యెలిశాల హేమచంద్ర, శరత్‌చంద్ర, యామ దయాకర్, ఆడెళ్ల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రంకు లైను పనుల పరిశీలన

హయత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మన్సూరాబాద్ డివిజన్‌లోని హయత్‌నగర్‌లోని స్వాతిరెసిడెన్సీ కాలనీ వద్ద కొనసాగుతున్న ట్రంకు లైను పనులను శనివారం జలమండలి అధికారులతో కలిసి కార్పొరేటర్ కొప్పుల నరసింహారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ట్రంకు లైను నిర్మాణానికి అవసరమైన నిధులను వెంటనే మంజూరు చేయాలని అధికారులను కోరారు. కార్యక్రమంలో కాలనీ వాసులు రామారావు, ప్రమోద్‌రెడ్డి సత్యం, సోమనాథ్, నక్క రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనుల పరిశీలన

మన్సూరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డివిజన్ ప్రజల అవసరాలను తీర్చడమే లక్ష్యంగా అభివృద్ధి పనులను చేపడుతున్నట్లు మన్సూరాబాద్ కార్పొరేటర్, జీహెచ్‌ఎంసీ బీజేపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. సెంట్రల్‌బ్యాంక్ కాలనీ, జడ్జెస్‌కాలనీ సహారా రెండో గేటు రోడ్డు నిధుల ప్యాకేజీలో భాగంగా రూ.10 లక్షలతో జడ్జెస్‌కాలనీ ఫేజ్-1 కాలనీలో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం ఆయన పరిశీలించారు.

'జీహెచ్‌ఎంసీ జిమ్‌లను వినియోగించుకోవాలి'

సైదాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): బస్తీలలో జీహెచ్‌ఎంసీ ఏర్పాటు చేస్తున్న జిమ్‌లను అందరూ సద్వినియోగం చేసుకోవాలని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి కోరారు. శనివారం హమాలీబస్తీ కమ్యూనిటీ హాల్ జిమ్‌ను జీహెచ్‌ఎంసీ క్రీడల విభాగం అధికారులతో కలిసి కార్పొరేటర్ ప్రారంభించారు.



వ్యాపారుల ట్రేడ్ లైసెన్స్‌లను తనిఖీ చేస్తున్న తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలి

హయత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని విధిగా ప్రతీ వ్యాపారి ట్రేడ్ లైసెన్స్‌లు తీసుకోవాలని తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమిషనర్ అమరేందర్‌రెడ్డి అన్నారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శనివారం మున్సిపాలిటీ పరిధిలోని హోటళ్ల, వ్యాపార సముదాయాలు, కిరాణా షాపులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తే జరిమానా విధిస్తామన్నారు. ట్రేడ్ లైసెన్స్ లేని వ్యాపార సముదాయాలకు నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు.



వరినాట్ల కోసం సిద్ధంగా ఉన్న మడులు



వర్షాలు కురిసిన వెంటనే నాట్లకు సిద్ధంగా ఉన్న వరినారు

ముఖం చాటేసిన వరుణుడు..!

- వానలకోసం ఎదురుచూస్తున్న రైతన్నలు
- సరిపడా నీరు లేక ఎండిపోతున్న మడులు
- వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆలస్యంగా వ్యవసాయ పనులు

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వానమ్మ వానమ్మ.. ఒక్కసారైనా వచ్చిపోవమ్మా అంటూ రైతులు ప్రతీ రోజు వరుణ దేవుడిని వేడుకుంటున్నా.. రైతుల మొరను ఆలకించడం లేదు. వానకాలం (ఖరీఫ్) సీజన్ ప్రారంభమై నెల రోజులు గడిచినప్పటికి వరుణుడు కరుణించడం లేదు. జూన్ మొదటి వారం నుంచే వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు రైతులు సిద్ధమైనా వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఏమి చేయాలో తోచక రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. వర్షం ఎప్పుడు వస్తుందా అని ప్రతీరోజు రైతులు ఆకాశం వైపు ఎదురుచూస్తున్నారు.

మురిపించి వెనక్కి తగ్గి

ఈ ఏడాది రుతుపవనాలు ముందుగానే వస్తున్నాయంటూ వాతావరణ శాఖ అధికారుల ప్రకటనలతో రైతులు సంబురపడ్డారు. అదే విధంగా వానాకాలం సీజన్ ప్రారంభంలోనే ఓ మోస్తరుగా వర్షాలు కురిసి రైతులను మురిపించాయి. దాంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. వరినారు పోయడంతో పాటు మెట్ట పంటల సాగుకు స్వీకారం చుట్టారు. ఆ తర్వాత వరుణుడు ముఖం చాటేశాడు. దీంతో వ్యవసాయ పనులు ముందుకు సాగక రైతులు ఆందోళనలో పడ్డారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నీటి కోసం రైతులు బోరు బావులపైనే ఆధారపడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో సరిపడా నీరు అందకపోడంతో పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. అయితే సరిపడా నీరు లభిస్తున్న బావుల వద్ద వరినాట్ల పనులను ప్రారంభించగా మరికొన్ని చోట్లా సరిపడా నీరు లేకపోవడంతో వరినాట్లకు విరామం ప్రకటించారు. రోహిణి, మృగశిర కార్తిలో నాటిన విత్తనాలు నీటితడి లేక మొలకెత్తడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని పలు గ్రామాల్లో వానాకాలం సీజన్‌లో సుమారు 5 వేల ఎకరాల్లో వరి పంట, సుమారు 200 ఎకరాలో కూరగాయల పంట సాగవుతున్నట్లు వ్యవసాయ అధికారులు చెబుతున్నారు.

వానల కోసం ఎదురుచూస్తున్నాం



వానాకాలం ప్రారంభమై నెల రోజులు కావస్తున్నా సరిపడా వర్షాలు కురువలేదు. నీరు సరిపోకపోవడంతో వ్యవసాయ పనులకు కొంత ఆటంకం కలుగుతుంది. వరినారు సిద్ధంగా ఉన్నా, నీరు సరిపోకపోవడంతో నాట్లు వేయలేకపోతున్నాం. వానలు పడాలని ప్రతీ రోజు దేవున్ని వేడుకుంటున్నాం.

\- కొలన్ ధర్మారెడ్డి, రైతు కవాడిపల్లి

కూరగాయల సాగుపై దృష్టి పెట్టాలి

వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగానే రైతులు పంటలు వేసుకోవాలి. వర్షాలు కొంత ఆలస్యం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. స్వల్పకాలిక రకాల పంటలపై కూడా రైతులు దృష్టి పెట్టాలి. ఈ నేపథ్యంలో కూరగాయల సాగుపై రైతులు దృష్టి సారించాలి.

\-పల్లవి, వ్యవసాయ అధికారి, అబ్దుల్లాపూర్‌మెట్ మండలం

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అభివృద్ధి ఆపం

ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి



మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్‌లను అందిస్తున్న మహేందర్‌రెడ్డి, మధు యాష్కిగౌడ్

హయత్‌నగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎన్ని ఇబ్బందులు ఎదురైనా అభివృద్ధి సంక్షేమాన్ని ఆపబోమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. రేవంతన్న భరోసా పథకంలో భాగంగా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో శనివారం హయత్‌నగర్‌లోని స్వామి శంకర్ ఫంక్షన్ హాల్‌లో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హజరైన ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలు ఎంతో ఇష్టంతో తెచ్చుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమాన్ని మరవదన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నా అధిగమించి సంక్షేమాన్ని అమలు చేస్తామన్నారు. టీపీసీసీ ప్రచార కమిటి ఛైర్మన్ మధు యాష్కి గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాల్లో అవకాశాలు కల్పిస్తుందన్నారు. పేద మహిళల కుటుంబాల్లో భరోసా నింపడానికి అనేక సంక్షేమ పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. త్వరలో స్కిల్ డవలప్‌మెంట్ కార్యక్రమాన్ని అమలు చేసి మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా 207 మంది లబ్ధిదారులకు కుట్టు మిషన్లు అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయానంద్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి, ముస్లీం మైనారిటీ కార్పొరేషన్ ఛైర్మన్ ఓబేదుల్లా కోత్వాల్, క్రిస్టియన్ మైనారిటి కార్పొరేషన్ ఛైర్మన్ దీపక్ జాన్, మల్‌రెడ్డి రాంరెడ్డి, టీపీసీసీ నాయకుడు గజ్జి భాస్కర్ యాదవ్, హయత్‌నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నగొని రవీందర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు లక్ష్మీప్రసన్న, కళ్లెం సుజాతారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అధికారం కోసమే ఎమర్జెన్సీ విధించిన ఇందిర: ఎంపీ లక్ష్మణ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ లక్ష్మణ్, ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న ఎంపీ లక్ష్మణ్

చంపాపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇందిరాగాంధీ తన అధికారాన్ని చేజెక్కించుకోవడానికి ఎమర్జెన్సీని విధించారని బీజేపీ జాతీయ ఓబీసీ మోర్చా అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్ అన్నారు. హస్తినాపురం డివిజన్ జెడ్పీ రోడ్ లోని వేదిక కన్వెన్షన్ హాల్లో శనివారం జరిగిన భారత ప్రజాస్వామ్యంలో చీకటి అధ్యాయానికి 50 రోజులు అనే సదస్సును నిర్వహించారు. రంగారెడ్డి జిల్లా బిజెపి అర్బన్ అధ్యక్షులు వనిపల్లి శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా లక్ష్మణ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ఫొటో ఎగ్జిబిషన్, వీడియో డాక్యుమెంట్‌ను తిలకించారు. అనంతరం ఎమర్జెన్సీలో జైలు శిక్ష అనుభవించిన పలువురిని లక్ష్మణ్ సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 25న సంవిధాన్ హత్యా దివస్‌గా నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, ఎల్బీనగర్ బిజెపి కన్వీనర్ కొత్త రవీందర్ గౌడ్, రంగారెడ్డి జిల్లా అర్బన్ ,రూరల్ మాజీ అధ్యక్షులు సామ రంగారెడ్డి, బొక్క నర్సింహారెడ్డి, కార్పొరేటర్లు నరసింహారెడ్డి, లచ్చిరెడ్డి, పవన్ కుమార్,జీవన్ రెడ్డి ,బద్దం ప్రేమమహేశ్వర్ రెడ్డి నాయకులు ఉద్యమకారులు విద్యాన్ రెడ్డి బాపిరెడ్డి బిజెపి బీజేవైఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇంటలిజెన్స్ డీఎస్పీ శివశంకర్ రావు మృతి

వనస్థలిపురం జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇంటలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పాలడుగు శివశంకర్ రావు వనస్థలిపురం ఆంధ్ర కేసర్ నగర్‌లోని తన నివాసంలో శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. 1996 బ్యాచ్‌కి చెందిన ఆయన నిజామాబాద్ తదితర ప్రాంతాల్లో ఎస్సైగా విధులు నిర్వహించారు. అనంతరం 2011లో ఇన్‌స్పెక్టర్‌గా పదోన్నతి పొంది సుల్తాన్ బజార్, చిక్కడపల్లి, బేగంబజార్ తదితర ప్రాంతాల్లో విధులు నిర్వహించారు. అనంతరం 2023లో ఏసీపీగా పదోన్నతి పొందిన శివశంకరరావు ఇంటలిజెన్స్‌లో డీఎస్పీంగా విధులు నిర్వహిస్తున్నాడు. కాగా కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఆయన స్వగృహంలో మృతి చెందాడు. ఈ మేరకు ఆయన మృతదేహానికి పలువురు ఉన్నతాధికారులు, ఆయన బ్యాచ్ మెట్లు నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. ఆదివారం సాహెబ్ నగర్ లోని స్మశాన వాటికలో అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.

పాఠశాలకు డ్యూయల్ డెస్క్ బెంచ్‌ల వితరణ

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్ మెట్ మండలం మజీద్‌పూర్ జడ్పీహెచ్‌ఎస్‌కు సికింద్రాబాద్ జూనియర్ చాంబర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రూ.3 లక్షల విలువైన 65 డ్యూయల్ డెస్క్ బెంచ్‌లను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రుల అభ్యర్థన మేరకు స్కూల్‌లో నీటి అవసరాల కోసం నూతన బోరుతో పాటు ప్రైమరీ స్కూల్‌కు మరో 20 డ్యూయల్ బెంచ్‌లను అందిస్తామని హామీ ఇచ్చారు.

అభివృద్ధి పనులు ఆగొద్దు : సబితారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లో చేపట్టిన ఏ ఒక్క అభివృద్ధి పని కూడా ఆగొద్దని, అన్ని పనులూ సకాలంలో పూర్తి చేయడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అధికారులకు సూచించారు. కార్పొరేషన్ పరిధిలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై సమీక్షించడానికిగాను జిల్లెలగూడలోని క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏయే పనులు ఏయే దశల్లో ఉన్నాయో అధికారులనడిగి తెలుసుకున్నారు.

ఘనంగా వారాహి దేవీ నవరాత్రులు

ఎల్‌బీనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్‌కేపురంలోని కుర్తాళ పీఠం ప్రత్యంగిరా దేవీ ఆలయంలో వారాహీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారికి 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, అర్చనలు, సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. శనివారం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆలయాన్ని దర్శించుకున్నారు. అనంతరం ఆమెను మునిపల్లి శ్రీనివాస్ దంపతులు జ్ఞాపికతో సత్కరించారు.

పనుల్లో నాణ్యత లోపించొద్దు: కళ్లెం

వనస్థలిపురం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లో చేపడుతున్న అభివృద్ధి పనులను నాణ్యతతో చేపట్టాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి అన్నారు. హయత్‌నగర్ డివిజన్ ఆటోసాయి నగర్‌లో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ పరిశీలించారు.

రోడ్డు ప్రమాదంలో యువతి మృతి

కొత్తపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ పీఎస్ పరిధి లో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ మండలం విజయపురి కాలనీలో ఉంటూ కూలీ పనులు చేసుకునే రాజేశ్వరి తన కుమార్తె నవ్య (24)తో కలిసి ఈ నెల 27 సాయంత్రం చైతన్యపురి కల్లు కాంపౌండ్‌కు వచ్చింది. అక్కడ వారి బంధువు దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన సునీల్‌తో కలిసి వారు రాత్రి వరకు కల్లు తాగారు. తన కుమార్తెను ఉప్పల్‌లో వదిలి పెట్టమని రాజేశ్వరి సునీల్‌కు చెప్పి ఇంటికి వెళ్లిపోయింది. తర్వాత ఇద్దరూ చైతన్యపురి ప్రాంతంలో తిరుగుతూ ఎన్‌టీఆర్ నగర్ కూరగాయ ల మార్కెట్ వద్దకు చేరుకున్నారు. అర్ధరాత్రి 2.30 గంటలకు గుర్తు తెలియని కారు ఢీకొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నవ్య మృతదేహాన్ని ఉస్మానియాకి తరలించారు. సునిల్ మృతురాలి తల్లికి సమాచారం ఇవ్వగా, శనివారం రాజేశ్వరి ఎల్‌బీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోను ఢీకొట్టిన డీసీఎం

ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు



నుజ్జునుజ్జయిన ఆటో

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విజయవాడ జాతీయ రహదారిపై ఆగి ఉన్న ఆటోను డీసీఎం కంటైనర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయిన సంఘటన అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. రాజబయ్య అనే వ్యక్తి ఆటోలో పెద్దఅంబర్‌పేట్ నుంచి అబ్దుల్లాపూర్‌మెట్‌కు వెళ్తున్నాడు. ఆటో రిపేర్ కావడంతో గండిమైసమ్మ ఆలయం ఒక రెస్టారెంట్ సమీపంలో ఆటోను నిలిపాడు. అదే సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ వైపుకు వస్తున్న డీసీఎం కంటైనర్ ఆటోను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. దాంతో ఆటో నుజ్జు నుజ్జు కావడంతో పాటు డ్రైవర్ రాజబయ్యకు తీవ్ర గాయాలుకాగా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాధితురాలి భర్త పరందామకు ఎల్‌ఓసీని అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం : సుధీర్‌రెడ్డి

చంపాపేట, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న పేదలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. హస్తినాపురం డివిజన్ నందనవనంకు చెందిన శ్రీలత కొన్ని రోజులుగా కీళ్లవాపులకు సంబంధించిన వ్యాధితో బాధపడుతోంది. మెరుగైన వైద్యం కోసం ఆమె నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ ఎమ్మెల్యేను సంప్రదించారు. సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయగా మంజూరయిన రూ. 1.50 లక్షల ఎల్‌ఓసీని ఆమె భర్త పరందామకు అందజేశారు.

శ్మశాన వాటికను సుందరీకరిస్తాం: కార్పొరేటర్

వనస్థలిపురం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సాహెబ్‌నగర్ శ్మశాన వాటికను నూతన హంగులతో తీర్చిదిద్దుతామని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. సాహెబ్‌నగర్ శ్మశాన వాటికను కార్పొరేటర్ లచ్చిరెడ్డి అధికారులతో కలిసి శనివారం పరిశీలించి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశాన వాటికలో నూతన రోడ్లు, బోరు, పచ్చదనం కోసం మొక్కల పెంపకం, ఇతర అభివృద్ధి పనులు చేపడుతామని ఆయన పేర్కొన్నారు. అక్కడ సమస్యలను పరిష్కరించి సుందరీకరణ పనులను వేగవంతంగా పూర్తిచేస్తామన్నారు. కార్యక్రమంలో ఈఈ రమేష్‌బాబు, డీఈ దామోదర్ రావు, ఏఈ గోపాలకృష్ణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ

మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు నివాళులర్పించిన పలువురు నేతలు

ఎల్‌బీనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు పీవీ నరసింహారావు అని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతిని పురస్కరించుకుని అల్కాపురి చౌరస్తాలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతదేశాన్ని పునర్నిర్మించిన నిజమైన నాయకుడు పీవీ అని కొనియాడారు. ఆర్థిక రంగం నుంచి అణుశక్తి కార్యక్రమం వరకు, అంతర్గత భద్రత నుండి విదేశాంగ విధానాల వరకు అన్నింటిపై తనదైన ముద్ర వేసిన మహనీయుడు అన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్‌శర్మ, ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు నగేష్, సరూర్‌నగర్ మాజీ అధ్యక్షుడు అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారు : దేప

కాంగ్రెస్ పార్టీ క్లిష్టపరిస్థితులో పార్టీ పగ్గాలను చేపట్టిన పీవీ ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపుతూ దేశ ప్రధాని పదవిని అధిష్ఠించి దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టారని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా అల్కాపురి చౌరస్తాలోని పీవీ విగ్రహానికి భాస్కర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. వేడుకల్లో ఆర్‌కేపురం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండి మధుసూదన్ రావు, తలాటి రమేష్, ఖిల్లా మైసమ్మ ఆలయ ఛైర్మన్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



అల్కాపురి చౌరస్తాలోని పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

కమ్మగూడలో...

హయత్‌నగర్: మాజీ ప్రధాని పీవీ జయంతిని తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కమ్మగూడ సాయి గణేష్ ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఇబ్రహీంపట్నం నియోజకవర్గం బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీవీ చిత్ర పటానికి పలువురు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రాహ్మణ సేవా సంఘం నియోజకవర్గం అధ్యక్షుడు మునిపట్ల మోహన్ రావు హాజరై మాట్లాడారు.



పీవీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, అరవింద్‌శర్మ, నగేష్, అంకిరెడ్డి తదితరులు



పీవీకి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ సలహాదారు హర్కర్ వేణుగోపాల్, పీవీ కుమారుడు ప్రభాకర్‌రావు, ఎంపీ డీకే అరుణ, డీసీసీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాస్‌రావు

ఓల్డ్‌మలక్‌పేటలో...

ఓల్డ్‌మలక్‌పేట: మాజీప్రధాని జయంతి ఓల్డ్ మలక్‌పేటలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. పీవీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మలక్‌పేట డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవికుమార్, రాజేందర్, ఉదయలక్ష్మీతదితరులు పాల్గొన్నారు.